

'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. కేంద్రంలోని బీజేపీ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి కార్మికుల పొట్ట కొడుతోందని, దీనికి నిరసనగా ఈనెల 16న జాతీయ కార్మిక సం ఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లాకార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు బండిదత్తాత్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

- ఉద్యానవన శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతి దందా
- రైతులు చెల్లించిన రూ.1.50 కోట్ల నిధులు స్వాహా
- ముగ్గురు జిల్లా ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు
- పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు
- అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు అసలుకే మోసం







నిధుల గోల్‌మాల్!

ఆదిలాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో అంతంత మాత్రంగానే నీటివనరులు అందుబాటులో ఉన్నాయి. దీంతో బిందు సేద్యంతో పంటలను సాగుచేసేందుకు రైతులు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రభుత్వం మైక్రోఇరిగేషన్ యూనిట్ల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే రాయితీపై రైతులకు సూక్ష్మసేద్యం పరికరాలను అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం ఉచితంగా అందిస్తుండగా ఇతర వర్గాల రైతులకు 90 శాతం సబ్సిడీపై యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రభుత్వం రాయితీపై అందించే బిందుసేద్యం పరికరాల కోసం రైతులు చెల్లించిన డబ్బులను అధికారులు పక్కదారి పట్టించారు. జిల్లా ఉద్యానవనశాఖలో కొన్నేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సందీప్‌కుమార్ అవినీతి దందాకు తెరలేపాడు. జిల్లా ఉన్నతాధికారుల కళ్లుగప్పి రైతులు చెల్లించిన డీడీ డబ్బులను జేబులో వేసుకున్నాడు. డీడీలు చెల్లించినా పరికరాలను అందించకపోవడంతో అనుమానం వచ్చి రైతులు ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. గతంలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన రిజ్వాన్‌భాషా ఉద్యానవన శాఖలో జరిగిన అవినీతిపై విచారణ కమిటీని నియమించారు. ఇంటిదొంగలే అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించారు. కొన్నేళ్లుగా ఉద్యానవన శాఖలో అవినీతి అక్రమాలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతులకు కుచ్చుటోపి

బిందు సేద్యం పరికరాల పేరిట రైతులకు కుచ్చుటోపీ పెట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. పరికరాల కోసం చెల్లించిన 10 శాతం సొమ్మును అధికారులు పక్కదారి పట్టియడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నెలల తరబడి ఎదురు చూసిన ఫలితం లేక పోవడంతో కొంతమంది రైతులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు బాగోతం బయటపడింది. కొన్నాళ్ల పాటు ఇదిగో అదిగో అంటూ కాలం గడిపిన అధికారులు అసలువిషయం తెలియడంతో నోరుమెదుపడం లేదు. సుమారుగా రూ.కోటీ 50లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. దీంతో జిల్లాలో వేలాది మంది రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఒక్కో రైతు యూనిట్‌కు రూ.10వేల చొప్పున డీడీల రూపంలో చెల్లించినట్లు తెలుస్తోంది. యూనిట్ మంజూరు కావాలంటే అదనంగా మరింత చెల్లించారన్న ఆరోపణలున్నాయి. నష్టపోయి న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, చెల్లించిన డీడీ డబ్బులను తిరిగి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిండు నిర్లక్ష్యం

జిల్లా ఉద్యానవన శాఖలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సందీప్‌కుమార్ అక్రమాలకు పాల్పడినట్లు అధికారులకు తెలిసిన నిండు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వస్తున్నాయి. కిందిస్థాయి ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులకు దారితీస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రధాన శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే కీలకంగా వ్యవహరిస్తూ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కొందరు జిల్లా అధికారులు కిందిస్థాయి ఉద్యోగులపై అన్నిరకాలుగా ఆధారపడడం, కంప్యూటర్ పరిజ్ఞానంపై కనీసఅవగాహన లేకపోవడంతో శాఖ పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులకు అందించే నివేదికలు కూడా తప్పుల తడకగానే మారుతున్నాయన్న విమర్శలు లేకపోలేదు. సుమారుగా గత మూడేళ్ల నుంచి అక్రమాలు జరుగుతున్న అధికారులు పసిగట్టలేకపోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయ నిధుల పర్యవేక్షణలో విఫలమయ్యారన్న కారణంతో హార్టికల్చర్ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డితోపాటు గతంలో పనిచేసిన నిర్మల్ జిల్లా అధికారి శ్యాంరావురాథోడ్, ప్రస్తుతం కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది.

చట్టపరమైన చర్యలు కరువు

అవినీతి అక్రమాలకు పాల్పడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించిన అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న వాదనలు విన్పిపిస్తున్నాయి. అవినీతికి పాల్పడిన ఉద్యోగిని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారేతప్ప స్వాహా చేసిన నిధులను తిరిగి రాబట్టేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదో అంతుచిక్కడం లేదంటున్నారు. రైతుల సొమ్మును జేబులో వేసుకున్న సదరు ఉద్యోగిపై కనీసం పోలీసుస్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత మూడేళ్లుగా అక్రమాలు జరుగుతున్నా అధికారులు అంత గోప్యంగా ఉంచడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రైతులు పలుమార్లు కార్యాలయానికి వచ్చి ప్రశ్నించినా దాటవేసే సమాధానం చెబుతు తప్పించుకున్నారేతప్ప అసలు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు కన్పించలేదు. ముందు నుంచి ఉద్యానవన శాఖ అధికారుల తీరుపై పలు ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. విధుల పట్లనిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ముగ్గురు అధికారులకు సస్పెన్షన్ వేటు తప్పలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రారంభమైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

జైనథ్, ఫిబ్రవరి 15: మండలంలోని కూర గ్రామంలో ప్రతీ మాఘమాసంలో నిర్వహించే కూర వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగులతో అలంకరించారు. వేంకటేశ్వర స్వామి పద్మావతి అలివేలు మంగమ్మలకు అభిషేకం, అలంకరణ నిర్వహించారు. సుభ్రతసేవ, మహాహారతి, తీర్థప్రసాద గోష్ఠిని నిర్వహించారు. దీంతోపాటు 16న యాగశాల ప్రవేశం, కుంభ అవాహన మండపారదన అగ్నిప్రతిష్ఠ, హోమం, గరుడ సేవ నిర్వహించనున్నారు. 17న కళ్యాణం కాని వారికి, సంతానం లేని వారికి గరుడ ప్రసాద వితరణ, 18న స్వామివారి కల్యాణోత్సవం, మహాప్రసాద వితరణ, రథోత్సవం ఊరేగింపు జాతర నిర్వహించనున్నారు.

బంద్‌కు కాంగ్రెస్ కమిటీ మద్దతు

ఆదిలాబాద్‌అర్బన్: ఈనెల 16న నిర్వహించే రైతుల, కార్మిక కర్షకుల భారత్‌బంద్‌కు ప్రజలు, వ్యాపారస్థులు సహకరించాలని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బంద్‌కు కాంగ్రెస్ కమిటీ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

కేసుల దర్యాప్తులో నాణ్యమైన పరిశోధనే కీలకం

- ఫోక్సో కేసుల బాధితుల వివరాలను గోప్యంగా ఉంచాలి: ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి15: న్యాయస్థానాల్లో నేరస్థుల శిక్ష శాతం పెరగాలంటే కేసుల దర్యాప్తులో నాణ్యమైన పరిశోధన కీలకమని ఎస్పీ గౌస్‌ఆలం పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీసు అధికారులతో ఏర్పాటుచేసిన నేరసమీక్ష సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ సబ్‌డివిజనల్ పరిధిలోని పోలీసుస్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను వాటి ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసులు, రేవ్‌కేసులు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటి, మహిళలపై జరుగుతున్న నేరాలు, గంజాయి కేసులు, ప్రస్తుత కేసు ఏ స్థితిలో ఉన్నదని, అంశాలపై సుదీర్ఘంగా సిబ్బందితో చర్చించి తగు సూచనలుచేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో కేసులలో బాధితుల వివరాలైన పేరు, ఊరు, తల్లిదండ్రులు, పాఠశాల వివరాలను బహిర్గతం చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం స్థానిక బ్రహ్మణవాడలో గల మహమ్మదీయ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎస్పీ గౌస్‌ఆలం ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు మార్గదర్శనం చేశారు. ముందుగా సైన్స్ ఎగ్జిబిషన్ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే 5వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ -2024 జిల్లా నుంచి హోంగార్డు నలిగంటి శంకర్ పాల్గొని ప్రతిభ కనబర్చడంతో పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ ఆయనను శాలువాతో సత్కరించి బహుమతి అందించి ప్రశంసించారు.


సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

హోంగార్డును అభినందిస్తున్న ఎస్పీ

సంక్షిప్త సమాచారం

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 15: కేంద్రీయ విద్యాలయ ఆదిలాబాద్‌లో పలు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ-హిందీ, ఇంగ్లీష్, సంస్కృతము, సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్‌సైన్స్, ప్రాథమిక ఉపాధ్యాయుడు (పీఆర్టీ), ఎడ్యుకేషన్ కౌన్సిలర్, స్పోర్ట్స్ కోచ్, స్టాఫ్‌నర్సు, స్పెషల్‌ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, స్పోర్ట్స్ కోచ్, స్టాఫ్‌నర్సు, స్పెషల్ ఎడ్యుకేటర్, కంప్యూటర్ బోధకుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 24న ఉదయం 8.30గంటలకు జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇతరవివరాలకోసం వెబ్‌సైట్‌ను, 9701481516నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనుల ప్రారంభం

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి15: ఆదిలాబాద్‌లోని తాంసి బస్టాండ్ రైల్వేలైన్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పనులు గురువారం ప్రారంభమయ్యాయి. రూ.97.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. అయితే అండర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని కొందరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ఆపాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో పనులు కొనసాగుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి15: జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం గురువారం జిల్లాకేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. హైదరాబాద్ నుంచి చంద్రాపూర్ జిల్లాకు వెళ్తున్న క్రమంలో సాయంత్రం జిల్లాకేంద్రంలోని పెన్‌గంగా భవన్‌లో ఆగి కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోకప్రవీణ్‌రెడ్డి, ఆదినాథ్, పలువురు కౌన్సిలర్లు తదితరులున్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా సస్యరక్షణ చేపట్టాలి

ఉట్నూర్, ఫిబ్రవరి15: ప్రస్తుతం వస్తున్న వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులు మామిడి, జామ తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు పండ్ల తోటల ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ సూచించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రం (పీహెచ్‌ఎన్‌టీసీ)లో ఉద్యాన నర్సరీల్లో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు, సిబ్బందికి పండ్ల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన గురువారం అవగాహన కల్పించారు. ఉద్యాన నర్సరీలో ఉన్న పండ్ల తోటలను పరిశీలించి, పంటలు నీటిఎద్దడిని తట్టుకునేలా చర్యలు తీసుకునేలాక చూడాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుడిహత్నూర్, ఫిబ్రవరి25: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మన్నూర్ ఎస్సీ కాలనీలో బుధవారంరాత్రి చోటుచేసుకుంది. మన్నూర్ ఎస్సీకాలనీకి చెందిన వాగ్మరే సూర్యకాంత్‌కు కడుపునొప్పి రావడంతో ఇటీవల అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా నొప్పి తగ్గలేదు. బుధవారం రాత్రి నొప్పి తీవ్రగా ఉండడంతో మెడికల్‌కు వెళ్లి మాత్రలు తెస్తానని భార్యకు చెప్పి వెళ్లి కాలనీ సమీపంలో ఉన్న క్రషర్‌వద్ద పురుగుల మందుతాగి పడి ఉండగా చూసిన వారు భార్యకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలి ంచగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై సయ్యద్‌ఇమ్రాన్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జైనథ్ మండల సర్వసభ్య సమావేశం వాయిదా

జైనథ్, ఫిబ్రవరి 15: జైనథ్‌లో రైతు వేదిక భవనంలో శుక్రవారం జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్ అధ్యక్షతన జరిగే జైనథ్ మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జైనథ్ ఎంపీడీఓ రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్ • బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు ఉపాధ్యాయులు, అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. గురువారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ మాట్లాడుతూ అత్యుత్తమ శిక్షణ అందించి క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. క్రీడాపోటీల్లో రాణించిన విద్యారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈనెల 21, 22న హైదరాబాద్‌లో జరిగే పోటీలకు జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని ఎంపికచేసి పంపుతామన్నారు. క్రీడాకారులు క్రీడల్లో విజేతలుగా నిలిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న క్రీడాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖేళోఇండియా సౌత్‌జోన్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన అబ్దుల్ అఫియజబీన్ క్రీడాకారిణికి గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ అందజేశారు. సమావేశంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఈవో ప్రణిత, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఘనంగా సేవాలాల్ జయంతి

ఉట్నూర్, ఫిబ్రవరి 15: జిల్లాలోని పలు మండలాల్లో అధికారులు, ఆయాసంస్థల ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని సేవాదాస్‌నగర్‌లో ఉన్న జగదాంబదేవి ఆలయంలో సేవాలాల్ జయంతి సందర్భంగా బోగ్‌బండారో పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం సేవదాస్‌నగర్ నుంచి వినాయకచౌక్, ప్రధానరహదారి గుండ, జగ్జీవన్‌చౌక్, అంబేడ్కర్‌చౌక్‌ల మీదుగా జీసీసీ పెట్రోల్‌బంక్ వరకు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ పల్లకి శోభాయాత్రను లంబాడా గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా నివాళులర్పించారు. సేవాలాల్ జయంతి కమిటీ గౌరవ అధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు, అధ్యక్షుడు రాథోడ్‌మహేందర్‌లు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం, ప్రకృతి ప్రేమికుడు, ఆధ్యాత్మిక గురువు, బంజారాల సాంస్కృతి సంప్రదాయాల పరిరక్షకుడని కొనియాడారు. అనంతరం జేఏసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ప్రధాన కార్యదర్శి బానోత్‌జగన్ మాట్లాడారు. లంబాడి గోరబోలి భాషాను 8వ షెడ్యూ ల్‌లో చేర్చాలని, ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని 26 గ్రామాల పెద్దలు నాయక్, కారోబారి, డవు, గేరియా, కమిటీ సభ్యులు, నాయకులు జాదవ్‌గోపాల్‌రావు, నేతావత్ రాందాస్ పవార్‌విజయ్, సుధాకర్‌నాయక్, గణేష్, ఈఈ రాథోడ్‌భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

• సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి: ఎమ్మెల్యే

గుడిహత్నూర్: సంత్‌సేవాలాల్ మహరాజ్ చూపినమార్గంలో నడవాలని ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ అన్నారు. మండలంలోని కొల్హారి తండాలో గురువారం నిర్వహించిన సేవాలాల్ మహరాజ్‌జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే గ్రామంలో నిర్మించే సీసీరోడ్లు నిర్మాణానికి భూమి పూజచేశారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాపశుసంవర్ధక శాఖ సహాయసంచాలకులు రాథోడ్‌రామారావు, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడే శీల, మాజీ సర్పంచులు జాదవ్ సునీత, తిరుమల్ గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, బీఆర్ఎస్ నాయ కులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ పాల్గొని పూజలు నిర్వహించారు. సేవాలాల్‌మహరాజ్ నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో పాటు జడ్పీటీసీ సంధ్యారాణి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

• సేవాలాల్ చూపించిన మార్గంలో పయణించాలి

బోథ్: సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సేవాలాల్ విగ్రహానికి అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలిరామ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ చూపించిన మార్గంలో ప్రతీఒక్కరు నడుచుకోవాలన్నారు. ఆయన సమాజ మార్పు కోసం కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్నారు. మండలంలోని సరిహద్దుల్లో ఉన్న కైలాస్‌టెకిడి ఆలయంలో రామారావు మహరాజ్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

• సంత్ సేవాలాల్ గొప్ప అధ్యాత్మిక వేత్త

ఇచ్చోడ: సంత్ సేవాలాల్ మహరాజ్ గొప్ప అధ్యాత్మిక వేత్త అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని సేవలాల్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సేవలాల్‌మహరాజ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, వైస్‌ఎంపీపీ జాలైజాకు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, అడె మానాజీ, అంబాదాస్, రమేష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: సేవాలాల్ మహరాజ్ 285 జయంతిని పురస్కరించుకుని నేరడిగొండ మండలంలోని బొందిడి గ్రామంలో నిర్వహించిన శ్రీసంత్ శ్రీగురు సేవాలాల్ మహరాజ్ జయంతిలో పాల్గొని ప్రత్యేకపూజల్లో పాల్గొని మాట్లాడారు. బంజారా జాతి పునర్జీవనానికి కృషిచేసిన మహాత్ముడు సేవాలాల్ మహరాజ్ బ్రిటిష్ అరచకాలపై పోరాటం చేసిన ధీరుడని కొనియాడారు. ప్రతీ బంజారా బిడ్డ ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో మండల బంజారా సోదరులు, ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా


ఇచ్చోడలో సేవాలాల్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రోడ్డు మరమ్మతులు చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

ఉట్నూర్, ఫిబ్రబవరి15: మండలంలోని బీర్సాయిపేట వద్ద రోడ్డు భవనాలశాఖ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని నిరసిస్తూ బీర్సాయిపేట గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. బీర్సాయిపేట గ్రామంలోని ఉట్నూర్ మంచిర్యాల ప్రధాన రహదారిపై మాజీ సర్పంచ్ అంకవ్వ ఆధ్వర్యంలో గిరిజనులు రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకో వాహనాలు నిలిచిపోయాయి. ఉట్నూర్ పోలీసులు సీఐ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని గ్రామస్థులను సముదాయించారు. విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ప్రజలకు హామీ ఇచ్చి రాస్తారోకోను విరమింపచేశారు.



ఆదిలాబాద్ డీఎస్పీ బదిలీ


నూతన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15 : ఆదిలాబాద్ డీఎస్పీగా పనిచేస్తున్న వి.ఉమేందర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన డీఎస్పీగా ఎల్.జీవన్‌రెడ్డి నియమితులయ్యారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఏసీపీ పనిచేస్తున్న ఆయనను ఆదిలాబాద్ డీఎస్పీగా బదిలీ చేశారు. ప్రస్తుతం డీఎస్పీగా ఉన్న వి.ఉమేందర్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.







భుడుందేవ్‌కు మెస్రంల పూజలు


ఆలయం వద్ద సాంప్రదాయ పూజలు నిర్వహిస్తున్న మెస్రం గిరిజనులు


భుడుందేవ్‌కు సింధూరం పూస్తున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్, ఫిబ్రవరి 15: మెస్రం వంశీయుల దైవం భుడుందేవ్‌కు ఆదివాసీ గిరిజనుల సాంస్కృతి సాంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. నాగోబా అభిషేకం కోసం తెచ్చిన గోదావరి పవిత్ర జలాలలోని కొంత నీటిని షాంపూర్‌లోని బుడుందేవ్ ఆలయానికి తీసుకువచ్చిన మెస్రం గిరిజనులు గురువారం ఉదయమే భుడుందేవ్ ఆలయాన్ని నీటితో శుభ్రపరిచి భుడుందేవ్‌కు సాంప్రదాయ పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మెస్రం వంశీయులు అందరుకలిసి భక్తి ప్రపత్తులతో భుడుందేవ్‌ను శుభ్రపరిచిన అనంతరం సింధూరం పూశారు. ఆ తర్వాత గంగాజాలంతో అభిషేకం నిర్వహించి పండ్లతో నైవేద్యం పెట్టారు. మేస్రం వంశీయులు అందరు తమ వెంట తెచ్చిన ధాన్యాన్ని ఒకచోట కుప్పగా సేకరించి పూజలు చేసిన అనంతరం ఆ ధాన్యంతో నైవేద్యం వండి భుదుందేవ్‌కు సమర్పించారు. ఈసందర్భంగా తమ సంస్కృతి సాంప్రదాయ వాయిద్యాలను మోగిస్తూ తెల్లని వస్త్రాలు ధరించి ఆలయం చుట్టూ చేరి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాంపూర్ జాతర ప్రారంభమైనట్లు ప్రకటించారు. పక్షం రోజుల పాటు జరుగనున్న జాతరలో ప్రజలందరు పాల్గొని భుడందేవ్‌కు పూజలు నిర్వహించాలని కోసు పటేల్ అన్నారు. శుక్రవారం మెస్రం గిరిజనులందరూ తమ ఇళ్లకు వెళ్తారని వారు వివరించారు. షాంపూర్‌లోని మేస్రం గిరిజనుల దైవం భుడుందేవ్‌కు ఉట్నూర్ ఎంపీపీ పంద్రజైవంత్‌రావు, ఆదివాసీ గిరిజన మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రంసుగుణ, మార్లవాయి మాజీ సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వర్లు, నర్సాపూర్‌బి, షాంపూర్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు కళావతిబండు, మల్లికా, శంకర్ తదితరులు పూజలు నిర్వహించారు.

ప్రార్థన మందిరం వద్ద ఉద్రిక్తత


కుభీర్‌లో పోలీసు బందోబస్తు


కుభీర్, ఫిబ్రవరి 15 : సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం శోభాయాత్ర నిర్వహించారు. ఆ మార్గంలో ఉన్న జాంగం కూడలి లో సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న ప్రార్థన మందిరం గేటు తెరిచి ఒక యువకుడు డ్యాన్స్ చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అక్కడే ఉన్న ఒక వర్గానికి చెందిన యువకులు ఇలా ఎందుకు చేస్తున్నావని అడగడంతో గొడవకు దారి తీసింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పలువురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అక్కడున్న యువకులతో మాట్లాడారు. ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని సముదాయించడంతో.. వివాదం సద్దుమణిగింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం

ఖానాపూర్ అభివృద్ధిని విస్మరించింది

● అసెంబ్లీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, ఫిబ్రవరి 15 : గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ విమర్శించారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో ఖానాపూర్ నియోజకవర్గ సమస్యలపై ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజక వర్గంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అప్పటి మంత్రి కేటీఆర్‌కు కడెం ప్రాజెక్టు ఎక్కడ ఉందో తెలియక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే కడెం ప్రాజెక్టు మరమ్మతుకు రూ.5.46కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. టైగర్‌జోన్‌లో రోడ్లకు ఫారెస్టు అధికారులు ఆపడం, కట్టెం కోసం వెళ్తున్న వారి పై కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నియోజక వర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని తెలిపారు.





అవగాహన లేకనే రోడ్డు ప్రమాదాలు

● భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో పోలీసులు


కుంటాల, ఫిబ్రవరి, 15: వాహన చోదకులు అతిచిన్న వయసులో అవగాహన లేకుండా వాహనాలు నడపడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. ముఖ్యంగా భారతదేశంలో 14 -20 సంవత్సరాల వయస్సు గల యువకులు అవగాహన లోపంతో వాహనాలు నడపడం వల్ల రోజుకు 500ల చొప్పున సంవత్సరం లక్ష 60 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కుంటాల మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్సు పొందిన తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. వాహన చోదకులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సెల్ పోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. వాహనాలకు సంబంధించి పత్రాలన్నింటిని ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవాలని అన్నారు. తమ పోలీసు సిబ్బంది ప్రతిరోజు వాహన చోదకులకు చాలన్‌లు విధిస్తుండడం మూలంగా కొంత మేర రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. విద్యార్థులు ప్రతీరోజు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. మానవ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని కావున ఈ దశలో ఎలాంటి దురాలవాట్ల వైపు చూడకుండా కష్టపడి చదివి లక్ష్యం సాధించేంత వరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎస్ఐ హన్మండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నారు.

కుభీర్‌లోని ఓ ఇంట్లో చోరీ

కుభీర్, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని శివసాయి ఆలయ సమీపంలో గల కొల్లేకర్ జీవన్‌రావు అనే వ్యక్తి ఇంట్లో గురువారం చోరి జరిగినట్లు బాధితులు తెలిపారు. కొల్లేకర్ జీవన్‌రావు భార్యభర్తలు రోజు కుభీర్ నుండి భైంసా వెళ్లి అక్కడ కొబ్బరి బొండాల దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లి గురువారం వచ్చి చూసే సరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఆయన తెలిపారు. బీర్వాలో ఉన్న రూ. 25వేల నగదు, 12తులాల వెండి చోరికి గురయినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు తెలపగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

'కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి'

ముథోల్, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ అన్నారు. గురువారం ముథోల్ మండలంలోని బ్రహ్మాన్‌గావ్, ఆష్ట, ఎడ్‌బిడ్ గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ సుకన్య రమేష్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలో సుమారు ఏడు కోట్ల 50 లక్షల వరకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. అధికారులు సైతం పక్షపాత ధోరణితో వ్యవహరించవద్దని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీలు అందే విధంగా చూడాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి సత్తా చాటాలన్నారు. ఆష్ట గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన విషయమే మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు మేలు చేసే విధంగా పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ జట్టు అశోక్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, ముథోల్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ఎంపీటీసీలు ఆత్మస్వరూప్, సునీత పోశెట్టి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.1 , కనిష్ఠం 20.6

నిర్మల్
జిల్లా వార్తలు

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్



ఖానాపూర్, ఫిబ్రవరి 15 : ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై ధర్మపురి వెళ్లారు. దీంతో ఆర్మూర్ మున్సిపల్‌లో రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్‌కు ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా (ఎఫ్ఏసీ) బాధ్యతలను అప్పగించారు. దీంతో మనోహర్ గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ మనోహర్ ఖానాపూర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేశారు.

జోరుగా గంజాయి దందా



- ఒడిస్సా నుంచి భారీగా దిగుమతి
- హైదరాబాద్ మీదుగా నిర్మల్ జిల్లాకు
- ఖరీదైన కార్లలో సరఫరా
- సరిహద్దులోని మహారాష్ట్ర నుంచి కూడా
- జోరుగా సాగుతున్న వినియోగం, అమ్మకాలు



అంతరాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

నిర్మల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా రాష్ట్రం నుంచి తెలంగాణలోని ఐదు జిల్లాలకు గంజాయి సప్లయ్ నెట్‌వర్క్ విస్తరించినట్లు పోలీసు అధికారులు నిర్ధారించారు. హైదరాబాద్, ఒడిస్సా, మహారాష్ట్రలకు చెందిన కొంతమంది గంజాయి స్మగ్లర్లు ఓ ముఠాగా ఏర్పడి పెద్దఎత్తున ఈ దందా కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ స్మగ్లర్లు గతానికి భిన్నంగా ఒడిస్సా రాష్ట్రం నుంచి నిర్మల్, ఆదిలాబాద్, జిల్లాలను కేంద్రం గా చేసుకొని గంజాయి సప్లయ్ కారిడార్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిర్మల్ నుంచి ఇటు జగిత్యాల అలాగే భైంసా మీదుగా మహారాష్ట్ర వరకు గంజాయి ఎగుమతి, దిగుమతులను కొనసాగిస్తున్నారన్న సమాచారాన్ని పోలీసులు పసిగట్టారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో గంజాయిని సప్లయ్ చేస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠాను ఇక్కడి పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లను పోలీసులు విచారించగా భారీ ఎత్తున కొనసాగుతున్న గంజాయి రాకెట్ వివరాలు వెల్లడయ్యాయి. ఒడిస్సా రాష్ట్రం లోని మల్కన్‌గిరి తదితర ప్రాంతాల నుంచి గంజాయిని వీరు రహస్యంగా హైదరాబాద్ తీసుకువచ్చి అక్కడి నుంచి ఆర్మూర్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్ వరకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. వీరంతా ఆషామాషీగా కాకుండా ఖరీదైన లగ్జరీకార్లలో గంజాయిని చేరవేస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా వీరు తమ కార్లలో ప్రత్యేక బాక్సులు తయారు చేసి ఆ బాక్సులలో గంజాయి పొట్లాలను దాచి పెడుతున్నారు. స్టైలిష్ డ్రైస్సులతో వీరంతా ఈ లగ్జరీ కార్లలో తమకున్న నెట్వర్క్ ద్వారా వివిధ ప్రాంతాలకు ఈ గంజాయిని తీసుకువస్తున్నారు. గత కొంతకాలం నుంచి ఆదిలాబాద్, నిర్మల్, భైంసా, ఆర్మూర్, జగిత్యాల, నిజామాబాద్ తదితర ప్రాంతాలలో గంజాయి విక్రయాలు అలాగే వినియోగం పెరిగిపోయిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ అంతర్‌రాష్ట్ర ముఠా వ్యవహారాలు బయటపడడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అయితే నిర్మల్‌లో పట్టుబడ్డ ఏడుగురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు మరింత లోతుగా విచారిస్తూ మొత్తం అంతర్‌రాష్ట్ర రాకెట్‌ను ఛేదించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే ఇక్కడి పోలీసులు ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో గంజాయి రాకెట్‌కు సంబంధించి సమాచారం అందించి క్లూ సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టా రంటున్నారు. అలాగే భైంసా సరిహద్దున గల మహారాష్ట్రలోని నాందేడ్, జాల్నా, ఔరంగాబాద్‌ల నుండి కైడా గంజాయి జిల్లాకే కాకుండా మరిన్ని జిల్లాలకు అక్రమంగా సరఫరా అవుతున్నట్లు కూడా ఫిర్యాదులున్నాయి.

అంతటా రిటైల్ నెట్‌వర్క్

గత కొంతకాలం నుండి యూత్ గంజాయికి అలవాటు పడుతున్న నేపథ్యంలో స్మగ్లర్లు తమ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగానే పలు ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల్లో అలాగే శివారు ఏరియాల్లో రహస్యంగా గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి అనుగుణంగానే ఇంటర్‌స్టేట్ గంజాయి స్మగ్లింగ్‌ముఠా ఈ రిటైల్ నెట్‌వర్క్ ద్వారా అమ్మకాలు సాగిస్తుందంటున్నారు. ప్రతీరోజు వేల రూపాయల్లో ఈ దందా సాగుతోందన్న ప్రచారం ఉంది. ఇదిలా ఉండగా పోలీసులు ఇప్పటికే గంజాయిని వినియోగించవద్దంటూ స్కూల్స్, కాలేజీలతో పాటు గ్రామాల్లో జరిగే కార్డన్‌సర్చ్, కాంటాక్ట్ ప్రోగ్రాంలలో కూడా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఈ అవగాహన కార్యక్రమాలు గంజాయి వినియోగదారులపై పెద్దగా ప్రభావం చూపడం లేదంటున్నారు. ముఖ్యంగా యూత్ గంజాయికి అలవాటు పడి మత్తులో జోగుతున్నారని చెబుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటే గంజాయి స్మగ్లర్లు తమ దందాను ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్త రించేందుకు ఈ అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా ఇప్పటికే ప్రయ త్నాలు మొదలుపెట్టిందని పోలీ సులు పేర్కొంటున్నారు. ఇదే జరి గితే ఈ గంజాయి దందా అమాయకులైన యువత జీవితాలను సర్వనాశనం చేసే ప్రమాదం లేకపోలేదంటున్నారు. ఇప్పటికైనా పోలీసు నిఘా విభాగాలు ఈ గంజాయి దందాను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరిహద్దులపై నిఘా

గత కొంతకాలం నుండి ఆదిలాబాద్, నిర్మల్, భైంసా, ఆర్మూర్, జగిత్యాల, నిజామాబాద్ తదితర ప్రాంతాలలో గంజాయి విక్రయాలు అలాగే వినియోగం పెరిగి పోయిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ అంతర్ రాష్ట్ర ముఠా వ్యవహారాలు బయట పడడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అయితే నిర్మల్‌లో పట్టుబడ్డ ఏడుగురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు మరింత లోతుగా విచారిస్తూ మొత్తం అంతర్ రాష్ట్ర రాకెట్‌ను ఛేదించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే ఇక్కడి పోలీసులు ఆయా ప్రాంతా ల్లోని పోలీసు అధికారులతో గంజాయి రాకెట్‌కు సంబంధించి సమాచారం అందించి క్లూ సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారంటున్నారు. అలాగే భైంసా సరిహద్దున గల మహారాష్ట్రలోని నాందేడ్, జాల్నా, ఔరంగాబాద్‌ల నుంచి కైడా గంజాయి నిర్మల్ జిల్లాకే కాకుండా మరిన్ని జిల్లాలకు అక్రమంగా సరఫరా అవుతున్నట్లు కూడా ఫిర్యాదు లున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం : ఎస్పీ జానకిషర్మిల



గంజాయి సరఫరాతో పాటు దాని వినియోగం, విక్రయాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ఇక నిఘాను మరింత విస్తృతం చేస్తాం. గంజాయి సరఫరా చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా పెడతాం. ముఖ్యంగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో విస్తృ తంగా గంజాయి వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. గంజాయి అమ్మకాలు, వినియోగంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలి. ఈ సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు గంజాయి సరఫరా కాకుండా అడ్డుకుంటాం. ఈ విషయంలో పోలీసులకు అందరూ సహకరించాలి.

అసెంబ్లీ దృష్టికి బాసర సమస్యలు

- సభలో గళం విప్పిన ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్
- గుండేగాం పునరావాసం
- ట్రిపుల్ ఐటీ సమస్యలు, బాసర ఆలయ అభివృద్ధిపై గురించి ప్రస్తావన



బాసర, ఫిబ్రవరి, 15 : అసెంబ్లీలో బాసర సమస్యలపై గురువారం ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్‌గళం విప్పారు. ట్రిపుల్ ఐటీ సమస్యలు, సరస్వతీ ఆలయ అభివృద్ధి గురించి సభ దృష్టికి తెచ్చారు. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో ఉన్న ఒక్క ట్రిపుల్ ఐటీకి రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకం జరగలేదని చెప్పారు. సుమారు 9 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న క్యాంపస్‌లో అన్ని విభాగాల్లో తగినంత సిబ్బంది లేరని కేవలం 19 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారని మిగితా వారంతా కాంట్రాక్ట్ పద్దతిన పనిచేస్తున్నవారేనని పేర్కొన్నారు. గత కొన్నిరోజుల నుంచి విద్యార్థుల సమస్యలతో వరుస ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్కడున్న అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని వేల మంది విద్యార్థులు ఉన్న క్యాంపస్‌కు మంచి వైస్ చాన్సలర్‌ను నియమించాలని కోరారు.

అదేవిధంగా దేశంలో ఉన్న ఒక్క సరస్వతీ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వెనక్కి తీసుకుందని తగిన నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా చిన్న సుద్దవాగు ప్రాజెక్టు ముంపు గ్రామమైన గుండేగాం నిర్వాహసితులకు పునరావాసం పెండింగ్‌లో ఉందని అవసరమైన నిధులు కేటాయించి ఆదుకోవాలని అన్నారు. ఇటీవలే కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

సమయపాలన పాటించని అధికారుల తీరుపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

భైంసా రూరల్, ఫిబ్రవరి 15 : మండలంలోని పాఠశాల, ఆసుపత్రి, గ్రామ పంచాయతీలలో సిబ్బంది, అధికారులు సమయపాలన పాటించకపోవడం పట్ల జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మహాగాం గ్రామంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ముందుగా జిల్లా పరిషత్ పాఠశాలకు చేరుకుని పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల గురించి ఆరాతీయగా ఫిజిక్స్ బోధించే ఉపాధ్యాయుడు సాయరెడ్డి ప్రత్యేక తరగతులు తీసుకోక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆసుపత్రిని తనిఖీ చేయగా ఒక్కరు కూడా విధుల్లో లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ డిప్యూటీ డీఎంహెచ్‌వోను చరవాణి ద్వారా సంప్రదించి సంబంధిత వైద్యులకు, సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతీ ఒక్క వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రికి రాకపోవడం, డ్యూటీ డాక్టర్ నిర్ణీత సమయానికంటే ముందుగానే వెళ్లిపోవడంపై వివరణ కోరారు. ప్రతీరోజు వైద్యులు, సిబ్బంది మధ్యాహ్నం వరకు మాత్రమే విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. అక్కడి నుంచి సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించగా నిర్వాహణ పట్ల అసహనం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణం, నర్సరీల నిర్వహణ బాగుందన్నారు. అక్కడి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని రికార్డులను తనిఖీ చేయగా రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కార్యదర్శి ప్రవీణ్ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీవో మోజాం హుస్సేన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులందరూ సమయపాలన పాటిస్తూ సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సరిగ్గా చూసుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో శివలింగం, హెచ్ఈవో సలీం, తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి మృతి



ఖానాపూర్, ఫిబ్రవరి 15 : కూతురు పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి తనువు చాలించిన ఘటన గురువారం ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీకి చెందిన పస్పుల (గాండ్ల) తిరుమలేష్ రాజమణి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు. కాగా రెండేళ్ల క్రితం పెద్ద కూతురు వివాహం చేసేందుకు తిరుమలేష్ అప్పులు చేశాడు. తీసుకున్న అప్పులను తీర్చలేకపోతున్నానని గత కొద్ది రోజులుగా కుటుంబ సభ్యుల వద్ద తిరుమలేష్ బాధ పడుతున్నాడు. కాగా గురువారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో శాంతినగర్ శివారులో పురుగుల మందు తాగి మృతి చెందాడు. ఈ మేరకు తిరుమలేష్ భార్య రాజమణి ఇచ్చిన ఫిర్యాదు ద్వారా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం నేటి తరానికి ఆదర్శం

285వ జయంతి వేడుకల్లో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఖానాపూర్, ఫిబ్రవరి 15 : సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బంజారాజాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్యమూర్తిగా సేవాలాల్ మహారాజ్ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీటీడీవో అంబాజీ, డీఈవో, స్థానిక ప్రిన్సిపాల్, ఎంపీడీవో తదితరులున్నారు.

గ్రామీణ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మహిళా సాధికారత సాధించేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలంతా అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు. గురువారం కడెం మండలంలోని అల్లంపల్లి గ్రామంలో స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన మిషన్ రేలా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానికంగా గ్రామీణ మహిళల సాధికారత కొరకై మహిళలు ఎక్కడికి వెళ్లే అవసరం లేకుండా డీఆర్డీవో ఆధ్వర్యంలో సహకార సంఘాల సహాయంతో తక్కువ ఖర్చుతో తయారు చేసిన శానిటరీ ప్యాడ్లను మిషన్ రేలా పేరుతో ఆయన ప్రారంభించారు. ఇటు వంటి ప్యాడ్లను ఉపయోగించడం ద్వారా వీటిని తయారు చేసే స్వయం సహాయక సంఘాలకు సైతం ఆర్థికంగా భరోసా కల్పించినట్లు అవుతుందని కలెక్టర్ తెలిపారు.



మిషన్ రేలా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మసల్గా తండాలో సేవాలాల్ జయంతి

తానూర్, ఫిబ్రవరి 15 : మండలంలోని మసల్గా తండాలో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నాయకులు పూల మాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ పుండ్లీక్, ఎంపీ టీసీ లక్ష్మణ్, బీజేపీ నాయకులు శివాజీపటేల్, సోమ్‌నాథ్, కృష్ణ, గ్రామస్తులు తదితరులున్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని గిరిజన తండాల్లో గురువారం బంజారాల ఆరాధ్య దైవం అయిన సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్‌టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ



నర్సాపూర్(జి), ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని స్థానిక అరవింద పాఠశాల వద్ద జాతీయ రహదారిపై ఉదయం 11 గంటల 50 నిమిషాలకు నిర్మల్ నుండి భైంసా వైపు వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు పెట్రోల్ పంపు వద్ద నుండి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న దౌనెల్లి లింగాల శంకర్‌ను ఢీకొట్టడతో ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో గాయపడ్డ శంకర్‌ను 108 సిబ్బంది కుడి పాదం రెండు వేళ్ళు తెగిపోవడంతో తీవ్ర రక్తస్రావం జరగడంతో ప్రథమ చికిత్స చేసి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కొరకు ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.